సాక్షి
కుమురం భీం
మంగళవారం। 14। మే। 2024



చింతలమానెపల్లి: మొదటిసారి ఓటు వేసిన స్వప్న, నిఖిత



ఓటు వేసిన అనంతరం సిరా చుక్క చూపుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ప్రశాంతంగా పోలింగ్

- జిల్లాలో 67.67 శాతం నమోదు
- గత ఎన్నికలతో పోల్చితే తగ్గిన వైనం
- జిల్లా కేంద్రంలో ఓటింగ్‌కు ఇబ్బందులు
- పలుచోట్ల వెనుదిరిగిన ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, అధికారులు



దహెగాం: సెల్ఫీ జోన్ వద్ద వృద్ధురాలు



రెబ్బెన మండల కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు



జిల్లా కేంద్రంలో ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న దివ్యాంగుడు

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికలు సోమవారం జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఓటుకు పోటెత్తారు. మావోయిస్టు ప్రభావిత జాబితాలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఉండడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే ఓటింగ్‌కు అనుమతించారు. గడువులోగా లైన్లలో ఉన్నవారికి మాత్రం ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. సమయంపై అవగాహన లేని కొందరు కేంద్రాలకు సాయంత్రం 4 గంటల తర్వాత చేరుకోవడంతో వారిని పోలీసులు బూత్‌ల్లోకి అనుమతించలేదు. జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాల, జెడ్పీ హైస్కూల్, కౌటాల, పెంచికల్‌పేట్ మండల కేంద్రాల్లో ఆలస్యంగా వచ్చారని అనుమతించకపోవడంతో ఓటర్లు వెనుదిరిగి వెళ్లారు. ఆసిఫాబాద్‌లోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సందడి చేశారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నుంచి వెబ్ కాస్టింగ్, సీసీ టీవీల ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

గంటల తరబడి నిరీక్షణ

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఉదయం ఏడు గంటల నుంచే బూత్‌ల్లో బారులు తీరినా.. చాలాచోట్ల ప్రక్రియ ఆలస్యమైంది. జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలోని 193, 194 బూత్‌ల్లో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయం 7.30 గంటలకు వచ్చిన వారు కూడా 11.30 గంటల వరకు క్యూలో ఉన్నారు. కేంద్రాలు ఇరుకుగా ఉండటంతో వృద్ధులు, మహిళలు అవస్థలు పడ్డారు. చీకట్లో గుర్తులు కనిపించక ఇబ్బంది పడ్డామని వాపోయారు. ఓటర్లు కలెక్టర్, అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, సీఐ సతీశ్ పోలింగ్ కేంద్రానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, బీజేపీ నాయకులు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సోమవారం సాయంత్రానికి పోలింగ్ ప్రక్రియ ముగియడంతో అందరి దృష్టి ఫలితాలపైకి మరలింది. గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయావకాశాలపై చర్చలు సాగుతున్నాయి.

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు

జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ హైస్కూల్ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితోపాటు పలువురు ప్రముఖులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓటింగ్ సరళి, పోలింగ్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

67.67 శాతం పోలింగ్

పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 67.67 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 67.21 శాతం, సిర్పూర్ నియోజకవర్గంలో 68.14 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లాలో 4,56,309 మంది ఓటర్లు ఉండగా, 3,08,784 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 676 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా.. అవసరమైన ప్రాంతాల్లో అదనంగా మరో 134 తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అయితే తిర్యాణి, కెరమెరి మండలాల్లో నూతన కేంద్రాల్లో కాకుండా పాతచోటే పేర్లు ఉండటంతో ఓటర్లు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చింది. ఉదయమే ఓటింగ్ ప్రారంభం కాగా మధ్యాహ్నం రద్దీ తగ్గింది. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు 13.84 శాతం ఓటింగ్ నమోదు కాగా.. ఉదయం 11 గంటల వరకు 33.71 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 51.89 శాతం, సాయంత్రం 3 గంటలకు 63.33 శాతం నమోదైంది. సాయంత్రం 5 గంటల వరకు 67.67 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. 2019లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో 71.42 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే గతేడాది నవంబర్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో 71.63 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో పోలిస్తే ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది.



ఓటుహక్కు వినియోగించుకున్న ఎస్పీ



జన్కాపూర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి



సిరా గుర్తు చూపుతున్న బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సిద్దంశెట్టి సుహాసిని



లింగాపూర్: కంచన్‌పల్లిలో తొలి ఓటు వేసిన యువతికి సన్మానం



జన్కాపూర్‌లో వృద్ధుడితో మాట్లాడుతున్న కలెక్టర్



పోలింగ్ ముగించుకుని వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



ఆసిఫాబాద్: విధులు పూర్తి చేసుకొని తిరిగి వస్తున్న సిబ్బంది

న్యూస్‌రీల్

వేగంగా విద్యుత్ పునరుద్ధరణ

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడగా.. వేగంగా పునరుద్ధరణ పనులు చేపట్టామని విద్యుత్‌శాఖ ఆసిఫాబాద్ ఎస్‌ఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం గాలివానతో చెట్లు విరిగి పడటంతో 33కేవీ ఫీడర్, 11 కేవీ ఫీడర్ పరిధిలో 22 స్తంభాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు 59 ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయని, ఆరు లైన్లు తెగి కిందపడ్డాయని వెల్లడించారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది కృషితోనే అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయగలిగామన్నారు. అహర్నిశలు శ్రమించిన సిబ్బందిని అభినందించారు.

మహిళా ఓటర్లకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మహిళా నిర్వాహక పోలింగ్‌కేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం ఈ కేంద్రానికి ఓటు వేసేందుకు వచ్చిన మహిళా ఓటర్లకు ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఆయన వెంట సిబ్బంది సంతోష్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

'తొలి' నిరాశ



పోలింగ్ కేంద్రం వద్ద సుప్రియ, అనసూర్య

కౌటాల(సిర్పూర్): తొలిసారి ఓటు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన యువతులకు నిరాశే మిగిలింది. కౌటాల మండల కేంద్రంలోని సదాశివపేటకు చెందిన సుప్రియ, ఎస్టీ కాలనీకి చెందిన అనసూర్య తొలి ఓటు వేయడానికి కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి సోమవారం సాయంత్రం 4 గంటల లోపు వచ్చారు. వీరు లోపల ఉండగానే సమయం ముగియగా అధికారులు గేటు మూసివేశారు. ఇక్కడ 169, 170, 171, 172 నాలుగు బూత్‌లు ఉండగా.. వారికి నంబర్ తెలియక మొదట 170 బూత్‌కు వెళ్లారు. అక్కడ ఓటు లేదని 172 పోలింగ్ బూత్‌కు వెళ్లాలని అధికారులు సూచించారు. వారు బూత్ నం.172కు వచ్చేసరికి సమయం ముగిసిందని, ఈవీఎం క్లోజ్ చేశామని పోలింగ్ అధికారి రాజమౌళి తెలిపారు. నిబంధనల ప్రకారం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రం లోపల ఉన్నామని, ఓటింగ్‌కు అవకాశం ఇవ్వాలని వారు వేడుకున్నారు. బందోబస్తు విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సత్యం ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైందని.. ఓటు వేయడానికి ఎందుకు ఆలస్యంగా వచ్చారని తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం 4.12 గంటలకు ఈవీఎం ఆఫ్ చేసినట్లు పోలింగ్ అధికారి తెలిపారు.

ఎన్నికల బహిష్కరణ.. హామీతో ఓటింగ్



మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: హామీ మేరకు తమ గ్రామానికి రోడ్డు వేయలేదని కాగజ్‌నగర్ మండలం బోరిగాం గ్రామస్తులు సోమవారం పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా మంత్రి సీతక్కతో ఫోన్‌లో మాట్లాడించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మీ గ్రామానికి రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఓటింగ్ వెళ్లారని రావి శ్రీనివాస్ తెలిపారు.


ఓటేసిన 'గోవెన'

తిర్యాణి(ఆసిఫాబాద్): గ్రామ సమస్యలు పరిష్కరించేంత వరకు ఎన్నికలను బహిష్కరిస్తామని తిర్యాణి మండలం గోవెన గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. అధికారులు అవగాహన కల్పించడంతో సోమవారం వారు ఎన్నికల్లో ఓటు వేశారు. 138 మంది ఓటర్లకు గాను 113 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటేసిన ఎంపీ అభ్యర్థులు



కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ



బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్



బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు

ఉట్నూర్‌రూరల్/బజార్‌హత్నూర్/తిర్యాణి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కుటుంబ సభ్యులతో కలిసి ఉట్నూర్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గ్రామంలో ఓటు వేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు తిర్యాణి మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. అనంతరం తిర్యాణి, రెబ్బెన మండలాల్లోని వివిధ పోలింగ్ బూత్‌లను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు.

మేము సైతం



పాల్వాయి హరీశ్‌బాబు



కోవ లక్ష్మి

బెజ్జూర్/తిర్యాణి: జిల్లాలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నం.234లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఓటు వేశారు. అలాగే తిర్యాణి మండలం మందగూడ గ్రామంలోని పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

అధికారుల తప్పిదం.. ఓటర్లకు భారం

- పోలింగ్ కేంద్రం ఒక చోట.. పేర్లు మరో చోట
- ఇబ్బంది పడిన ఓటర్లు



భోలాపటార్‌లో ఓటేసి గౌరీకి వెళ్తున్న ఓటర్లు

కెరమెరి(ఆసిఫాబాద్): జిల్లాలో ఈసారి అదనంగా పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే అధికారుల తప్పిదంతో స్థానికంగా పోలింగ్ బూత్ అందుబాటులోకి వచ్చినా గ్రామస్తులు ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి ఓటేయాల్సిన పరిస్థితి నెలకొంది. కెరమెరి మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని గౌరీలో మొత్తం 211 మంది ఓటర్లు ఉన్నారు. కానీ ఓటరు జాబితాలో 177 మంది పేర్లు మాత్రమే నమోదయ్యాయి. గతంలో వీరు గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని భోలాపటార్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దూరభారం తప్పించేందుకు పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం నూతనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశా రు. స్థానికంగా ఓటు హక్కు వినియోగించుకుందామని సంబురపడిన గ్రామస్తులకు నిరాశే మిగిలింది. 177 మంది ఓటర్లలో సుమారు 90 మంది పేర్లు భోలాపటార్ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో నమోదు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు కాలినడకన.. మరికొందరు బైక్‌లు, ఆటోల్లో భోలాపటార్‌కు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే భోలాపటార్, లెండిగూడ గ్రామానికి చెందిన పలువురు ఓటర్ల పేర్లు కూడా గౌరీ పోలింగ్ కేంద్రంలో ఉండటంతో ఇబ్బంది పడ్డారు.

సమాచారం లేకుండానే..

గౌరీ గ్రామం భోలాపటార్ గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఆయా గ్రామాల పూర్తి సమాచారం జనాభా, ఓటర్లు తదితర వివరాలు పంచాయతీ కార్యదర్శి వద్ద ఉంటాయి. అలాగే అంగన్‌వాడీ సిబ్బంది, బీఎల్‌వో వద్ద కూడా ఉంటుంది. కానీ ఎలాంటి సమాచారం లేకుండా, పూర్తి వివరాలు తీసుకోకుండా జాబితా రూపొందించారని స్థానికులు మండిపడుతున్నారు. బీఎల్‌వో మాత్రం గౌరీ గ్రామానికి చెందిన 211 మంది ఓటర్ల జాబితాను అధికారులకు నివేదించినట్లు చెబుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



మా గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారంటే ఎంతో సంబురపడ్డాం. కానీ మళ్లీ స్థానిక కేంద్రంలో ఓటు లేదని చెప్పారు. లెండిగూడకు వెళ్లిఓటు వేయాల్సి రావడంతో ఇబ్బంది పడ్డాం.. అధికారుల నిర్లక్ష్యంతోనే మా పేర్లు తారుమారయ్యాయి.

– కంచ్‌కట్లె ఉత్తం, గౌరీ

గౌరీ పోలింగ్ కేంద్రంలో ఓటు



కొన్ని సంవత్సరాలుగా భోలాపటార్‌లో ఓటు వేస్తున్నా. ఈ సంవత్సరం పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆరు కిలోమీటర్ల దూరంలోని గౌరీ పోలింగ్ కేంద్రంలో నా పేరు ఉంది. ఈ విషయం ఎవరిని అడగాలో తెలియక గౌరీ గ్రామానికి వెళ్లి ఓటేశా.

– చున్ని మహాదేవ్, భోలాపటార్

ఆదర్శం గునాబాయి



కుమారుడి సాయంతో ఓటు వేసి వస్తున్న గునాబాయి

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం కెలి బి గ్రామానికి చెందిన 104 ఏళ్ల వృద్ధురాలు కేంద్రె గునాబాయి సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంది. గునాబాయికి పది మంది సంతానం. వారిలో నలుగురు వివిధ కారణాలతో మృతి చెందగా.. ప్రస్తుతం నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు కేంద్రె కేశవ్ సాయంతో వీల్‌చైర్‌పై కెలి బి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసింది. ఓటు వేయడం అందరి బాధ్యతని, తాను బతికి ఉన్నంత కాలం ప్రతీ ఎన్నికల్లో ఓటేస్తానని చెప్పింది. వందేళ్లు పైబడినా ఓటు హక్కు వినియోగించుకుని కేంద్రె గునాబాయి ఆదర్శంగా నిలిచింది.

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇల్లు



ఆలుగామలో కూలిన ఇల్లు

కోటపల్లి: మండలంలో కురిసిన వర్షానికి ఆలుగామ గ్రామానికి చెందిన పెద్ది సత్తయ్య ఇల్లు నేలమట్టం అయ్యింది. సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

అదుపుతప్పి కారు బోల్తా



పంటపొలాల్లో పడిపోయిన కారు

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బపల్లి బస్‌స్టాప్ వద్ద సోమవారం కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తా పడటంతో అందులో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. సోమనపల్లికి చెందిన బన్ని, సిద్ధార్థ, అజయ్ కారులో ఆస్నాద వైపుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సిద్దార్థకు గాయాలు కావడంతో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

పోలింగ్ కేంద్రంలో ఊడిన పైకప్పు



గాయపడిన సాయికృష్ణ

బెజ్జూర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన 219వ పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సాయికృష్ణకు గాయమైంది. పోలింగ్ కేంద్రం బిల్డింగ్ పైకప్పు నుంచి సిమెంటు రాలి పడడంతో ఆయన భుజానికి గాయమైంది.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మంచిర్యాలఅర్బన్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లిన వారందరూ సొంత ఊళ్ల బాట పట్టారు. సోమవారం ఎన్నికలు ముగియడం.. తిరుగు ప్రయాణంతో రద్దీ దృష్ట్యా ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. మంచిర్యాల డిపో నుంచి హైదరాబాద్‌కు ఇదివరకు 25 హైటెక్‌సిటీ, 3ఇంద్ర, ఎనిమిది ఏసీ, నాన్ ఏసీ లహరి బస్సులు, ఎనిమిది ఎక్స్‌ప్రెస్ బస్సులు మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎన్నికల వేళ సోమవారం రాత్రి మరో నాలుగు రిజర్వేషన్ బస్సులతోపాటు ఎనిమిది ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులోకి తెచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆదిలాబాద్ డిపో నుంచి రిజర్వేషన్, నాన్ రిజర్వేషన్ బస్సులు 8, నిర్మల్ నుంచి 12, ఆసిఫాబాద్ డిపో నుంచి 9, మంచిర్యాల నుంచి 12, ఉట్నూర్ 1, భైంసా నుంచి 2 ప్రత్యేక బస్సులు హైదరాబాద్‌కు నడిపారు.

ఉత్సాహంగా తొలి ఓటు

- మొదటిసారి ఓటు వినియోగించుకున్న యువత
- నిజాయతీగా ఓటేయడం గర్వంగా ఉందంటున్న పౌరులు

ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో ఓటుహక్కు ఎంతో కీలకం. ముఖ్యంగా ఈ విషయంలో యువత బాధ్యతగా ఓటు వేయాల్సి ఉంటుంది. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఎన్నికల కమిషన్ ఓటుహక్కు కల్పించడంతో పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి మొదటిసారి ఓటువేసి కొత్త అనుభూతి పొందారు. ఈ సందర్భంగా మొదటిసారి ఓటు వేసిన పలువురు యువతీ యువకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

ఓటేసిన కవలలు



మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన కవలలు ఆది శ్రీజ ఎంబీబీఎస్, శ్రీకర్ ఇంజినీరింగ్ చేస్తున్నారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేశాన్ని పాలించే వారిని ఎన్నుకునేందుకు ఓటు ఒక ఆయుధమని, అందుకే తాము ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చామన్నారు.

– ఆది శ్రీజ, ఆది శ్రీకర్, మంచిర్యాల



ముధోల్: పోట్‌పల్లిలో తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్న యువకులు



ఆనందంగా ఉంది

నిర్మల్‌చైన్‌గేట్: ఈసారి నాకు మొదటిసారి ఓటు హక్కు వచ్చింది. ఫస్ట్ టైం ఓటు వేయడం చాలా ఆనందంగా ఉంది. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి మాకెప్పుడు అవకాశం వస్తుందా అని ఎదురుచూసేవాళ్లం. ఇప్పుడు ఆ అవకాశం రావడం సంతోషంగా ఉంది. – పల్లవి, నిర్మల్

సంతోషంగా ఉంది



లక్ష్మణచాంద: మాది లక్ష్మణచాంద మండలంలోని పార్‌పెల్లి. పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– ధనలక్ష్మి, పార్‌పెల్లి

హైదరాబాద్ నుంచి వచ్చా



మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ చదువుతున్నా. నాకు మొదటిసారి ఓటు హక్కు రావడంతో వినియోగించుకునేందుకు మంచిర్యాలకు వచ్చా. మొదటిసారి ఓటు వేయడం ఆనందంగా ఉంది. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి.

– గడియారం అక్షయ, మంచిర్యాల

యువత పాత్ర కీలకం



నిర్మల్‌చైన్‌గేట్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం. ఎన్నికల ద్వా రా మన భవిష్యత్‌ను మనమే నిర్ణయించుకునే అవకాశం లభిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. తొలిసారిగా ఓటు వేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది.

– శ్రీయ, ప్రియదర్శినినగర్, నిర్మల్

ధనిక, పేద తేడాలేనిది..



నిర్మల్‌చైన్‌గేట్: ధనిక, పేద, స్త్రీ, పురుష, తది తర తేడాలు లేకుండా పొందే ఓటు హక్కును మొదటిసారి సక్రమంగా వినియోగించుకున్నా. ఎన్నికైన నాయకులు సరిగా పనిచేయకుంటే అప్పటికప్పుడు తొలగించే అధికారం ఓటర్లకు కల్పించాలి.

– శ్రీవాణి, బుధవార్‌పేట్, నిర్మల్

కొత్త అనుభూతి



నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేయడం ఆనందంగా ఉంది. గతంలో బ్యాలెట్ పేపర్లపై ఓటు వేసేవారు. ప్రస్తుతం ఈవీఎంలో ఓటు వేస్తున్నారని చెబితే వినడం తప్ప చూడలేదు. మొదటిసారి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడం ఓ కొత్త అనుభూతినిచ్చింది.

– రసజ్ఞ, ప్రియదర్శినినగర్, నిర్మల్

వరంగల్ నుంచి వచ్చా



సోన్: మాది సోన్ మండలంలోని న్యూవెల్మల్ గ్రామం. వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. నాకు మొదటిసారి ఓటుహక్కు రావడంతో వరంగల్ నుంచి వచ్చి ఓటువేశా. చాలా ఆనందంగా ఉంది.

– కొండ రిత్విజ, న్యూవెల్మల్, సోన్

ఇటీవలే ఓటుహక్కు వచ్చింది



లక్ష్మణచాంద: మాది లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం. ఇటీవలే ఓటుహక్కు వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిసారి ఓటు వినియోగించుకున్నా. చాలా ఆనందంగా ఉంది.

– సౌజన్య, ధర్మారం

సంతృప్తినిచ్చింది



నిర్మల్‌చైన్‌గేట్: ఫస్ట్ టైం ఓటు వేయడం ఆనందంగా ఉంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన తీసుకురావాలి. – రేణుక, ఇందిరానగర్, నిర్మల్

ఆతృతగా ఓటేశా..



నిర్మల్: నాకు 18ఏళ్లు రాగానే ఓటుహక్కు కోసం అప్లయ్ చేసుకున్నా. ప్రస్తుతం హైదరాబాద్‌లో చదువుతున్నా. తొలిసారే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటువేయడానికి చాలా ఆతృతగా వచ్చి ఓటేశా. కొత్తగా అనిపించింది. – లక్కడి శివసాయిరెడ్డి, నిర్మల్

బాధ్యతగా అనిపించింది..



నిర్మల్: హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నా. ఎన్నికల్లో ఓటు వేయడం ఇదే తొలిసారి. అమ్మానాన్నలతో కలిసి వెళ్లి ఓటేశా. ఈ దేశపౌరాలిగా ఓటువేయడం నా బాధ్యత అన్న ఫీలింగ్ అనిపించింది.

– కారేగామ అక్షయ, నిర్మల్

తెలియని ఫీలింగ్..



నిర్మల్: ఓటు వేయడం ఓ కొత్త ఫీలింగ్‌లా ఉంది. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లగానే ఓటర్‌గా ఓ బాధ్యత మనపై ఉందన్నట్లు అనిపించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కును వినియోగించుకున్నా.

– శశాంక్, నిర్మల్

'సరిహద్దు'ల్లో పోలింగ్ ప్రశాంతం

- 23 రోజుల్లో రెండోసారి ఓటేసిన ఓటర్లు



భోలాపటార్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గత నెల 19న మహారాష్ట్రలోని చంద్రపూర్ సెగ్మెంట్‌కు 15 గ్రామాలకు చెందిన ఓటర్లు ఓటు వేయగా 23 రోజుల్లోనే మరోమారు తెలంగాణ లోని ఆదిలాబాద్ పార్లమెంట్‌కు ఓటు వేశారు. అయితే మహారాష్ట్రలో 60 శాతం పోలింగ్ నమోదు కాగా సోమవారం జరిగిన ఎన్నికల్లో 63 శాతం నమోదైంది. పరంధోళి పోలింగ్ కేంద్రంలో మొత్తం ఓటర్లు 850 ఉండగా 508 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముకదంగూడలో 714 మందికి 412, భోలాపటార్‌లో 806 మందికి 515, అంతాపూర్‌లో 810 మందికి 562, గౌరీ పోలింగ్ కేంద్రంలో 177 మందికి 116 మంది ఓటు వేశారు. కొత్తగా గౌరీ, ముకదంగూడ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో పోలింగ్ శాతం పెరిగినట్లు తెలుస్తుంది.

భయం..భయంగా..

ఒక ఓటరు ఒకసారి ఒకే వైపునకు ఓటు వేయాలని నిబంధన ఉందని, రెండుసార్లు వేస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు ప్రచారం చేసిన నేపథ్యంలో అలాంటి వాతావరణం కనిపించలేదు. ఏ ఒక్క అధికారి కూడా మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటు వేశారా? అని కూడా ప్రశ్నించక పోవడంతో ఓటర్లు నిర్భయంగా ఓటు వేశారు. అక్కడి ఎన్నికల్లో ఓటు వేసిన మరుక్షణమే నిమ్మకాయతో వేలికి అంటించిన సిరాను తుడిచివేయడం వారికి కలిసివచ్చిన అవకాశం. ఏ ఒక్క ఓటరును కూడా పోలింగ్ అధికారులు రిజెక్ట్ చేయలేదు. మొత్తంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా 'సరిహద్దు' పోలింగ్ ప్రశాంతంగా జరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

చేతులు లేకున్నా.. చైతన్యం చూపాడు



జాకీర్ పాషా కాలి వేలికి సిరా గుర్తు వేస్తున్న ఎన్నికల అధికారి

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఓటు వేసిన ఈ దివ్యాంగుడి పేరు జాకీర్ పాషా. పుట్టుకతోనే రెండు చేతులూ లేవు. సోమవారం కాగజ్‌నగర్‌లోని ఫారెస్ట్ డివిజన్ ఆఫీసులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కుడి కాలితో సంతకం చేసి కాలితోనే తన ఓటర్ కార్డును ఎన్నికల అధికారులకు అందించాడు. అనంతరం అతని ఎడం కాలి రెండో వేలుకు అధికారులు ఇంకు గుర్తు పెట్టారు. కుడి కాలి బొటన వేలితో ఈవీఎం మిషన్‌పై ఓటు హక్కును వినియోగించుకున్నాడు.

అడవుల నుంచి పోలింగ్ కేంద్రం వరకు

తాండూర్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాండూర్ మండలంలోని నర్సాపూర్ పోలింగ్ కేంద్రంతో పాటు చుట్టుపక్కల అటవీ ప్రాంతంలో కేంద్ర బలగాలు ముమ్మర తనిఖీలు నిర్వహించాయి. సోమవారం సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏఆర్ ఎస్సై నేతృత్వంలో రిజర్వుడ్ , బీఎస్ఎఫ్ బలగాలు నర్సాపూర్ చుట్టు పక్కల అటవీ ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. మాదారం ఎస్సై గొల్లపల్లి అనూష నర్సాపూర్ పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల నిర్వహణ తీరును పర్యవేక్షించారు.



కూంబింగ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

శ్రీరాంపూర్‌లో పోలింగ్ ప్రశాంతం

- రెండు బూత్‌లలో కొద్దిసేపు ఈవీఎంల మొరాయింపు
- పోలింగ్ కేంద్రాల వద్ద యూనియన్ నాయకుల సందడి

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ప్రాంతంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఏరియాలోని కార్మికులు, కార్మిక కుటుంబాలు, ఇతరులు తమ ఓటుహక్కు సద్వినియోగం చేసుకున్నారు. సింగరేణి ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వడంతో ఉదయమే ఎక్కువ శాతం కార్మిక ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఆర్కే 6 కొత్తరోడ్‌లోని సాక్షర స్కూల్‌లో 281, 282 పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు కొద్ది సేపు మొరాయించాయి. ఎండ తీవ్రత తక్కువగా ఉండటంతో ఓటర్లు ఊపిరి పీల్చుకున్నారు. కార్మిక క్షేత్రం కావడంతో మాతృ పార్టీల అభ్యర్థులను గెలిపించడం కోసం కార్మిక సంఘాల నేతలు చివరి సమయం వరకూ కష్టపడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద చివరి సారిగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. బీఆర్ఎస్ తరుపున టీబీజీకేఎస్, బీజేపీ తరుపున బీఎంఎస్, కాంగ్రెస్ తరపున ఐఎన్టీయూసీతో పాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఏఐ టీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య శ్రీ రాంపూర్‌లోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. గేటు బయట వారి కేడర్‌తో కలిసి కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని ఓటర్లను కోరారు. ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజేస్ బోర్డు చైర్మన్ బీ జనక్ ప్రసాద్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. నస్పూర్ కాలనీలోని సేవా భవన్ వద్ద గల పోలింగ్ కేంద్రంలో టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచి ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బండి రమేష్, పానుగంటి సత్తయ్య, వెంకట్‌రెడ్డి, రమేశ్, అన్వేశ్‌రెడ్డి తదితరులు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కార్మిక కుటుంబాలను కోరారు. శ్రీరాంపూర్‌లోని శారద శిశుమందిర్ తదితర కేంద్రాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు సందర్శించారు.



నస్పూర్ సేవా భవన్ వద్ద టీబీజీకేఎస్ నాయకులు



పోలింగ్ కేంద్రం వద్ద మాట్లాడుతున్న జనక్ ప్రసాద్



శ్రీరాంపూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద సీతారామయ్య

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



భీంరావ్ (ఫైల్)

లక్సెట్టిపేట: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయినగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన రాథోడ్ భీంరావ్ (38)కు సత్యసాయినగర్ కాలనీకి చెందిన దేవికతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. దంపతులిద్దరూ ఇక్కడే కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. కొద్దిరోజులుగా భీంరావ్ మద్యానికి బానిస కావడంతో దంపతుల మధ్య గొడవలు తలెత్తాయి. దీంతో అతని బావమరుదులు వచ్చి దాడి చేయడంతో మనస్తాపానికి గురై ఈనెల 12న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని తల్లి జంగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వరిపేట గ్రామస్తుల నిరసన



పోలింగ్ బహిష్కరించిన వరిపేట గ్రామస్తులు

కాసిపేట: మండలంలోని వరిపేట గ్రామస్తులు తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కొత్తవరిపేట, పాతవరిపేట గ్రామాలను కలిపి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గత అసెంబ్లీ ఎన్నికల్లో గంటన్నరకు పైగా పోలింగ్‌కు వెళ్లకుండ నిరసన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం అదేవిధంగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి నాలుగు గంటలపాటు ఓటు వేసేందుకు వెళ్లలేదు. దీంతో కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ రెవెన్యూ అధికారులతో మాట్లాడి గ్రామస్తులకు నచ్చచెప్పడంతో మధ్యాహ్నం 12గంటల సమయంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా, గత ఎన్నికల ముందు నచ్చచెప్పి హామీ ఇచ్చిన ప్రస్తుత ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై